క్లుప్తంగా

మాలలకు రోస్టర్ విధానంలో అన్యాయం



బాన్సువాడ రూరల్: ఎస్సీ వర్గీకరణ ద్వారా చేపడుతున్న రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల సంఘం వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ ఆరోపించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మంత్రి వివేక్ వెంకట్‌స్వామిని కలిశారు. మాలలకు రిజర్వేషన్ శాతాన్ని పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మాలలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. బీర్కూర్ మండల అధ్యక్షుడు బేగరి గంగాధర్, ప్రవీణ్ కుమార్, మిలింద్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు కటికె రమేశ్, నల్ల సత్యం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బందాల రాజులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ...త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ గాధారి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల నుంచి ప్రేరణ పొందాలి



బీబీపేట: మహనీయుల నుంచి ప్రేరణ పొందాలని విద్యార్థులకు తెలియజేస్తూ జనగామలో ఆదివారం కాన్షీరాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత శక్తి ప్రోగ్రామ్ జిల్లా బాధ్యులు బెల్లె రాజలింగం మాట్లాడుతూ.. బుద్ధుడు, అశోకుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా పూలే, అంబేడ్కర్, కాన్షీరాంలు విముక్తి ఉద్యమాలను కొనసాగించి దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారని అన్నారు. మహనీయుల త్యాగాలు ప్రేరణగా తీసుకోవాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, అంబేడ్కర్ సంఘం నాయకులు రాజబాబు, రాము, బాబు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జనం కోసం రచనలు చేయాలి



కామారెడ్డి అర్బన్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషావేత్త, సుప్రసిద్ధ రచయిత, అనువాదకులు డాక్టర నలిమెల భాస్కర్‌ను తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ కలిశారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన సాహితీ సమావేశంలో నలిమెలను గఫూర్ శిక్షక్ కలిసి తన రచనలు 'ధైర్య కవచం' యుద్ధ గీతం అందజేశారు. జనం కోసం ప్రజ సమస్యల పరిష్కార దిశలో రచనలు చేయాలని నలిమెల సూచించినట్టు తెరవే జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఎర్రాపహాడ్, దేమికలాన్, క్రిష్టాజీవాడి, కరడ్‌పల్లి, సోమారం, నందివాడ తదితర గ్రామాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ గ్రామాల్లో చికెన్, మటన్ సెంటర్ యజమానులు, నిర్వాహకులు వ్యర్థాలను రోడ్ల పక్కన, ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారు. దీంతో కుక్కలు బాగా జమై జనావాసాల మధ్య తిరుగుతున్నాయి. దారిని పోయే వారిని కరుస్తున్నాయి. పలువురు ఈ మధ్య ఆస్పత్రి పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. గతంలో కూడా కరడ్‌పల్లి, తాడ్వాయి, నందివాడ శివారులో పశువుల పాకలో ఉంచిన మేకలు, గొర్రెల పిల్లలపై కూడా దాడిచేశాయి. అధికారులు చొరవ తీసుకొని గ్రామాలలో ఉన్న కుక్కలను బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వారాంతపు సంత.. తప్పని చింత

- మండల కేంద్రాల్లో రోడ్లపైనే సంతలు
- టెండర్లు వేసి ప్రజల నుంచి పన్నులు వసూళ్లు
- సంతల్లో వసతులు మాత్రం నిల్



దోమకొండలో రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల సంత

దోమకొండ: రైతులు కష్టపడి పండించిన కూరగాయలకు మద్దతు ధర లభించడంతో పాటు దళారుల పాత్ర లేకుండా వినియోగదారులకు తాజా, నాణ్యమైన కూరగాయలు విక్రయించడానికి వారాంతపు సంతల పాత్ర ఎంతో కీలకం. జిల్లాలో చాలా చోట్ల వారాంతపు సంతల నిర్వహణకు మెరుగైన స్థలం, వసతులు లేక రోడ్లపైనే క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. రైతులకు, ముఖ్యంగా మహిళలకు కనీస అవసరాలు తీర్చుకునేందుకు మౌలిక వసతులు లేవు. దీనికి తోడు పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకల కోసం వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

రోడ్లపై సంతలతో తీవ్ర ఇబ్బందులు..

దోమకొండ మండల కేంద్రంలో ప్రతి సోమవారం వారాంతపు సంత నిర్వహిస్తారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శివరామమందిర్ వరకు దాదాపు కిలో మీటరు పొడవున సంత కొనసాగుతుంది. సంత నిర్వహణ కోసం తైబజార్ వేలం పాట వేస్తారు. గత ఏడాది దోమకొండలో తైబజార్ వేలం రూ.2లక్షల70వేలకు వేలం పాట వేశారు. అదేవిధంగా బీబీపేట మండల కేంద్రంలో ఆదివారం, పాల్వంచ మండల కేంద్రంలో ప్రతి బుధవారం, జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో వారాంతపు సంతలు రోడ్డుపైనే కొనసాగుతున్నాయి. ఇక్కడ శాశ్వత స్థలాలు, వసతులు లేక ప్రధాన రోడ్లపై కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. తైబజార్ వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయంతో పంచాయతీ పాలకవర్గాలు మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా ఎలాంటి వసతులు సమకూర లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో ఇంకా దారుణంగా ఉందని రైతులు వాపోతున్నారు.

పలు రకాల ఉత్పత్తుల విక్రయాలు..

వారాంతపు సంతల్లో పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. దోమకొండ మండల కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాలతో పాటు భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి, లక్ష్మీరావులపల్లి, మల్లుపల్లి, కాచాపూర్‌తో పాటు మాచారెడ్డి మండలం ఎల్పుగొండ, ఫరీద్‌పేట, వాడి గ్రామాల నుంచి రైతులు వస్తారు. వివిధ రకాల పంటలను ఇక్కడికి అమ్మడానికి వారు తీసుకొస్తారు. రోడ్లపైనే విక్రయాలు చేస్తుండటంతో అవస్థలు తప్పడం లేదు. సాయంత్రం సమయంలో జనంతో రద్దీగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, పాదచారులు సైతం రాకపోకలు సాగించటం కష్టతరంగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో రద్దీ అధికంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు సైతం ముందుకు సాగని పరిస్థితి నెలకొంటోంది. దోమకొండతో పాటు, ప్రధాన గ్రామాల్లో గ్రామంలో ప్రధాన రహదారిపై సంత ఉండగా ఆర్టీసీ బస్సులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారాంతపు సంతలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చనిపోయిన వారు ఓట్లేస్తారా.?



ఓటరు జాబితాలో మూడేళ్ల క్రితం చనిపోయిన భూతిపిల్లి సాయవ్వ, ఆమె మనువడు మహేశ్ పేర్లు



ఒకే వ్యక్తి ఫొటోతో రెండు ఓట్లు

- ఓటరు జాబితాలో మృతుల పేర్లు
- బీర్కూర్‌లో తప్పుల తడకగా జాబితా



ఓటరు పేరు, ఓటరు భర్త పేరు గ...ర అని ఉన్న దృశ్యం

బాన్సువాడ: ఎన్నికలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం అధికారులు పదే పదే చెబుతున్నా.. క్షేత్ర స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారింది. ఏళ్ల క్రితం మృతి చెందిన వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓటు హక్కు ఉండటమే అందుకు నిదర్శనం. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీర్కూర్‌లో విడుదల చేసిన ఓటర్ల జాబితాలో పలు తప్పులు జరిగాయి. బీర్కూర్‌కు చెందిన భూతిపిల్లి సాయవ్వ(క్రమ సంఖ్య 1576) మూడేళ్ల క్రితం మృతి చెందింది. ఆమె మనువడు భూతిపిల్లి మహేష్(క్రమ సంఖ్య 1578) ఏడాది క్రితం మృతి చెందాడు. వారి పేర్లు ఇప్పటికీ జాబితాలో ఉండడం గమనర్హం. ఇలా ఒక్కరిద్దరే కాకుండా బీర్కూర్ మండలంలో పదుల సంఖ్యలో మృతి చెందిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన మొల్ల బాబాకు 535, 536 వరుసలో రెండు చోట్ల ఓటు వచ్చింది. అలాగే షేక్ అబ్దుల్ అజీంకు 729, 730 వరుసలో రెండు చోట్ల వచ్చింది. ఇదే ఓటరు జాబితాలో 1298 వరుస క్రమంలో ఓ వ్యక్తి పేరు గ..ర అని ఉంది. ఇదే పేజీలో మరో చోట 1302 వరుస క్రమంలో ఓటరు పేరు మోలా మోసినా అని ఉంటే భర్త పేరు దగ్గర మాత్రం గ..ర అని ఉంది. ఇలా ఓటర్లు జాబితాలో చాలా చోట్ల తప్పులు దొర్లాయి. ఈ విషయంపై బీర్కూర్ తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

మెంటల్ వెల్‌నెస్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ప్రిన్సిపల్ శ్రీనివాస్

బాన్సువాడ: బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాలలో విద్యార్థులకు మెంటల్ వెల్‌నెస్‌పై మధుమాలంచ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ యార్లగడ్డ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఎంచుకునే లక్ష్యంపై ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. క్రమశిక్షణ, ప్రయోగాలు, సమస్యల పరిష్కారం, జ్ఞానం, సామర్థ్యాలు, సృజనాత్మకత, కృత్యాలు, నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం శ్రీనివాస్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, కార్యదర్శి జెట్టి రవీందర్, కోశాధికారి గాలయ్య, సభ్యులు కోట్టూరి సంతోష్, మేకల విఠల్, రషీద్, కిషోర్‌దాస్, అశోక్ యాదవ్, రమేష్, సాయికృష్ణ, సుధాకర్‌రెడ్డి, బస్వంత్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ శాఖ కార్యాలయంలో ప్రజావాణి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ విజయసారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి ప్రజావాణిలో ఫిర్యాదులను వినియోగదారులు అందించవచ్చని తెలిపారు.

ఇస్రోజీవాడిలో కళాజాత

కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడి గ్రామంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించనున్నట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ప్రేమలు–మోసాలు, వివిధ సామాజిక అంశాలపై కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పోలీసులు కోరారు. కళాజాతకు రూరల్ సీఐ, ఎస్సైలు హాజరవుతారని వారు తెలిపారు.

కాచాపూర్ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో సంబురాలు



భిక్కనూరు: ఏడుపాయల దేవాలయంలో మండలంలోని కాచాపూర్ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాసేవా సమితి సభ్యులు, గ్రామస్తులు ఏడుపాయల వనదుర్గ ఆలయానికి కుటుంబీకులతో తరలి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ముగించారు. పెద్ద ఎత్తున అక్కడ అన్నప్రసాదంపంపిణీ చేశారు. అమ్మవారికి ముడుపులు కట్టారు.

గుంతలు పూడ్చరూ..!



ఎల్లారెడ్డిరూరల్: అడివిలింగాల గ్రామానికి వెళ్లే దారిలో గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అడివిలింగాలగేట్ నుంచి అడివిలింగాల గ్రామానికి వెళ్లే దారిలో గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డుపై గుంతలను పూడ్చి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వంద భజనమాల



కామారెడ్డి అర్బన్: స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సత్యసాయి వంద భజనమాల నిర్వహించారు. సత్యసాయి శతజయంతి సంవత్సరం సందర్భంగా భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్టు సేవా సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పాల్గొని భజనలు పాడారు. ప్రతినిధులు భాస్కరశర్మ, మహేష్, విఠల్, లింబాద్రి, శ్రీనివాస్, అశోక్, విఠల్, రవీందర్, శోభారాణి, కల్పన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వేంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాలలో పూజలు చేశారు. తమ కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని దేవతామూర్తులను వేడుకున్నారు. రెండవ శనివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహాల పున:ప్రతిష్ఠాపన



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవతల పున:ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేవతల విగ్రహాలను గ్రామంలో వేద పండితులు మధుశర్మ పంతులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు యజ్ఞం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు అరిగె సాయిలు, కంది మల్లేష్, అయినాల లింగం, కూని సాయాగౌడ్, అల్లం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో భిక్కనూరు విద్యార్థుల ప్రతిభ



భిక్కనూరు: కరీంనగర్ జిల్లా కేంద్రంలో పరుగు పందెం పోటీల్లో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ముగ్గురు ప్రతిభ చూపి పతకాలను పొందినట్లు కోచ్ భరత్‌రాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు మనుశ్రీ, జ్యోత్స్న, ఠాగూర్‌లు ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొని మూడవ స్థానంలో నిలిచి మెడల్స్‌ను అందుకున్నారని కోచ్ వెల్లడించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నిరసన



భిక్కనూరు: సుప్రీంకోర్టు సీజే జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ వద్ద నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంథని స్వామూల్ మాదిగ అన్నారు. ఆదివారం అంతంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామిక వాదులందరూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక



సమావేశమైన బోర్లం గ్రామస్తులు



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

బాన్సువాడ రూరల్: బోర్లంలో ఆదివారం గ్రామస్తులు సమావేశమై గ్రామంలోని ఆలయాల అభివృద్ధిపై చర్చించారు. శిథిలావస్థకు చేరిన దేవాలయాలకు మరమ్మతులు చేయాలని తీర్మానించారు. ఈమేరకు ఆలయాల అభివృద్ధికి కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా బసిరెడ్డి హన్మంత్‌రెడ్డి ఎన్నుకున్నారు. అలాగే అధ్యక్షుడిగా ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మన్నె విఠల్, కార్యదర్శిగా శివరాజులు, కోశాధికారిగా భాను ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పర్వారెడ్డి, కెశెట్టి రాజు, టేకుల మొగులయ్య, ఇంద్రసేనారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో బీసీ కమిటీ ..

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం డిపో బీసీ కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక శివశక్తి గణేశ్ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో బాన్సువాడ డిపో బీసీ ఉద్యోగుల కమిటీ చైర్మన్‌గా శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, కార్యదర్శిగా తులసీరామ్ మారుతి, సలహాదారులుగా బసంత్, శంకర్ గౌడ్, పి.శంకర్, గిరిధర్, మల్లయ్యలను ఎన్నుకున్నారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.గోపాల్‌ను ఎన్నుకున్నారు. నేతలు అంబాజీ, శివరత్, రవీందర్‌గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకును కూల్చేయాలి



నస్రుల్లాబాద్: అంకోల్ గ్రామంలో గల వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరిందని.. వాటర్ ట్యాంకు నిర్మించి 30 ఏళ్లు పైనే అయ్యిందని ఏ క్షణాన కూలుతుందో తెలియక భయాందోళనలో ఉన్నామని స్థానిక గ్రామస్తులు వాపోయారు. ఈదురుగాలులు, భారీ వర్షాల సమయంలో కూలితే ఇళ్లపై పడే అవకాశముందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కూల్చేయాలని గ్రామ ప్రజలు కోరారు. గ్రామస్తులు హన్మండ్లు యాదవ్, పరిగె సంతోష్‌రెడ్డి, మోహన్ చెన్ను రాములు, సాకేత్, గణేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఒడి బియ్యం



భిక్కనూరు: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో జంగంపల్లి గ్రామానికి చెందిన వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఒడి బియ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు చేపట్టారు. కట్నకానుకలు, సారెను బహూకరించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు జీపీ సిద్ధరాములు, శంకర్, నాగరాజు, మల్లికార్జున్, శ్రీనివాస్, రమేష్, సురేష్ రాజు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెహందీ, గాజుల సంబురాలు



తిప్పాపూర్‌లో ఏనుగురెడ్డి సంఘం ఆధ్వర్యంలో మెహందీ, గాజుల సంబురాల కార్యక్రమం



పాల్గొన్న ఏనుగురెడ్డి సంఘం కుటుంబాలు

భిక్కనూరు: తిప్పాపూర్‌లో ఏనుగు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మెహందీ, గాజుల సంబురాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక గ్రామ దేవతల ఆలయాల ప్రాంగణంలో సంఘం మహిళలు మెహందీ, గాజులను పెట్టుకుని సంబురాల్లో పెట్టుకున్నారు. పలు ప్రాంతాల్లో నివసిస్తున్న సంఘం కుటుంబీకుల ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం గ్రామదేవతలకు ఒడిబియ్యంను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

స్నేహానికి గుర్తుగా 'దోస్తుల గాజులు'

కామారెడ్డి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని మహిళలు చుక్కాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి, ఉగ్రవాయి మైసమ్మ ఆలయం, గిద్ద మైసమ్మ ఆలయం, తదితర ఆలయాల వద్దకు వెళ్లి గాజుల సంబురాన్ని జరుపుకుంటున్నారు. సాంప్రదాయ బద్ధంగా ఒకే రకమైన చీరలు ధరించి వివిధ రకాల పాటలకు డాన్సులు చేస్తూ, కుర్చీ ఆట, కర్చీఫ్ ఆట, వన్ మినిట్ గేమ్స్, బెలూన్ పేల్చడం వంటి ఆటలు ఆడుతూ సంతోషంగా గడుపుతున్నారు.

సంక్షిప్తం

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



కామారెడ్డి రూరల్: లింగాపూర్ గ్రామ పరిధిలో గల కల్కినగర్‌లో సమస్యలు తిష్టవేశాయి. మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని, కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ బాగాలేదని, చెత్త బండి రావడం లేదని, స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు జవాన్‌కు, వార్డు ఆఫీసర్‌కు, మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పట్టించుకోకపోతే ట్యాక్సులు చెల్లించబోమని కాలనీవాసులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి పాముల వాగు తాత్కాలిక వంతెన పనులు కొనసాగుతున్నాయి. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు లింగంపల్లి వద్ద పాముల వాగు వంతెనతో పాటు ఇరు వైపులా రోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. దాంతో ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వంతెన వద్ద మొరం వేసి ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లడానికి రాకపోకలు పునరుద్ధరించారు. సెప్టెంబర్ 4న సీఎం రేవంత్‌రెడ్డి కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనను పరిశీలించి రూ. కోటి నిధులు మంజూరు చేశారు. నాలుగు రోజులుగా వర్షాలు లేకపోవడంతో పనులు వేగవంతం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కామారెడ్డి అర్బన్: ప్రాథమిక విద్యార్థుల సౌకర్యాల కోసం అవార్డీ టీచర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహర్, బాల్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక సాందీపని డిగ్రీ కళాశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 మంది ఉత్తమ ఉపాధ్యాయుల దంపతులను సన్మానించారు. అనంతరం ఎంపిక చేసిన ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రూ.25 వేల విలువైన కుర్చీలను దేవునిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం గంగాకిషన్ తన తండ్రి జ్ఞాపకార్థం విరాళంగా అందజేశారు. డాక్టర్ పి.మల్లికార్జున్, హరిస్మరణ్‌రెడ్డి, అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు సేనాపతి, ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ : యం.మధుసూధన్ : 99510 27699
ఎల్లారెడ్డి : ఎం.శ్రీనివాస్ : 97044 90298
కామారెడ్డి(1) : కె.రాజు : 99496 99861
కామారెడ్డి(2) : ఆర్. అనిల్ : 63039 58947
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899